క్లుప్తంగా

మహాకాళేశ్వరునిగా మల్లికార్జునస్వామి దర్శనం



గుంటూరు ఎడ్యుకేషన్: కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా మల్లికార్జునపేటలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జున దేవస్థానంలో స్వామిని ఉజ్జయిని శ్రీమహా కాళేశ్వరునిగా విశేషంగా అలంకరించారు. కపాలధారిగా, స్మశాన రుద్రునిగా దర్శనమిచ్చిన స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామికి విశేష అభిషేకాలు జరిపారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జీజీహెచ్ ఉద్యోగిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మనోరమ తనను లంచం అడిగినట్లు అక్కడే పనిచేస్తూ ఇటీవల డ్రైవర్‌గా పదవీ విరమణ చేసిన మామిడి బాబ్జి సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. తాను జీజీహెచ్‌లో 33 సంవత్సరాలు పనిచేసి అక్టోబరులో పదవీ విరమణ చేశానని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇచ్చేందుకు రూ. 30వేలను సీనియర్ అసిస్టెంట్ లంచం అడిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా సీనియర్ అసిస్టెంట్ పనితీరుపై ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు వడ్డే బాలయ్య కూడా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలసి ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఆమె ఉద్యోగుల్ని మామూళ్లు అడిగిందని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేపు పెదపాలెంలో బజరంగ్ నేత్రజ్యోతి

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ




కొరిటిపాడు(గుంటూరు): బజరంగ్ ఫౌండేషన్ సామాజిక సేవా పరంపర కొనసాగిస్తూ నేత్రజ్యోతి పేరుతో అంధత్వ సమస్య నివారణకు గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. పొన్నూరు మండలంలోని పెదపాలెంలో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నేత్రజ్యోతి కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమ సారథి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో రైతులు, రైతు కూలీలు, వెనుకబడిన వర్గాలు, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలు ఎక్కువగా ఉన్న గ్రామాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శిబిరాల్లో కంటి సమస్య ఉందని గుర్తించిన వారికి ఏడు రోజుల్లోగా కళ్లజోళ్లు అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో అనేక గ్రామాల్లో నిర్వహించిన నేత్రజ్యోతి శిబిరాలకు అనూహ్య రీతిలో స్పందన లభించిందని చెప్పారు. ఇప్పటి వరకు 14,024 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి, 12,005 మందికి కళ్లజోళ్లు అందించినట్లు అంబటి మురళీకృష్ణ వివరించారు.

రౌడీషీటర్ మృతి

గుంటూరు ఈస్ట్: రౌడీషీటర్ మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదుచేశారు. శ్రీనివాసరావుపేటలో నివసించే రౌడీషీటర్ షేక్ చాంద్‌బాషా (45) కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం నగరంపాలెం ఐసీఐసీఐ బ్యాంకు వద్ద మృతి చెంది పడి ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వారు చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు.

చానల్‌లో దూకి వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం



చేబ్రోలు: అనారోగ్య సమస్యలతో సతమతమవుతూ మనస్తాపానికి గురైన వృద్ధురాలు సోమవారం చేబ్రోలులోని కొమ్మమూరు చానల్‌లో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న ఆమెను స్థానికులు, 108 సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి ప్రాణాలు కాపాడారు. చుండూరు మండలం మున్నంగివారి పాలెం గ్రామానికి చెందిన గుత్తా జయలక్ష్మి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. సోమవారం చుండూరు నుంచి వచ్చిన ఆమె కొమ్మమూరు చానల్ బ్రిడ్జి నుంచి కొంత దూరం వెళ్లి అక్కడ నీటిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రవాహానికి కొట్టుకుపోతున్న ఆమెను బ్రిడ్జి నిర్మాణ పనులు చేస్తున్న బిహార్‌కు చెందిన కూలీలు గమనించి, చానల్‌లో వినాయక విగ్రహ నిమజ్జనాలు చేసే మట్టి దిబ్బ వద్దకు చేర్చారు. హుటాహుటిన సంఘటనా ప్రాంతానికి చేరుకున్న 108 సిబ్బంది చాకచక్యంగా ఒడ్డుకు చేర్చారు. చానల్‌లో దూకడంతో జయలక్ష్మి కాలు విరిగిపోయింది. సుమారు పది అడుగుల ఎత్తులో ఉన్న కట్టమీదకు చేర్చటానికి సమస్యగా మారింది. పెద్ద సంచిలో వృద్ధురాలిని కూర్చోబెట్టి ఇనుప నిచ్చెన ద్వారా స్థానికుల సహాయంతో 108 సిబ్బంది పైకి తీసుకువచ్చారు.

ఎంపీ గల్లా జయదేవ్ ‘పచ్చ’పాతంపై రగడ

- ఎంపీ ల్యాండ్స్ నిధులు టీడీపీ కార్పొరేటర్లకే కేటాయింపుపై ఆగ్రహం
- వైఎస్సార్ సీపీ వార్డులకు మొండి చెయ్యిపై కార్పొరేటర్ల ధ్వజం



వైఎస్సార్ సీపీ, టీడీపీ సభ్యుల మధ్య వాగ్వివాదం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్‌ని గెలిపిస్తే ఆయన మాత్రం టీడీపీ కార్పొరేటర్ల వార్డులకే ఎంపీ ల్యాండ్స్ కింద నిధులు మంజూరు చేశారని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ వార్డులకు నిధులు ఇవ్వారా ? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ సభ్యులు కావాలనే కౌన్సిల్‌లో డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ సభ్యులు ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పే క్రమంలో టీడీపీ సభ్యులు అడ్డుపడుతుండటంపై సభలో వాగ్వివాదం జరిగింది. సోమవారం నగర మేయర్ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో జరిగింది. ఉదయం 10.30గంటలకు ప్రారంభమైన సమావేశం సభ్యుల 61 ప్రశ్నలు, 102 ప్రతిపాదనలతో, నగరపాలక సంస్థకు సంబంధించి మూడు ప్రియాంబుల్స్‌తో సోమవారం రాత్రి వరకు సుదీర్ఘంగా సాగింది.

తొలగించిన హోర్డింగ్స్/బోర్డులు తిరిగి ప్రత్యక్షం

గుంటూరు నగరంలో అనధికార హోర్డింగ్స్‌లో ఇటీవల 70 దాకా తొలగించారని, వాటిని ఎక్కడ పెట్టారో చూపించాలని కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, షేక్ రోషన్‌లు పట్టుబట్టారు. దీనికి సీపీ ప్రదీప్ కుమార్ యార్డులో ఉన్నాయని సమాధానం ఇచ్చారు. సదరు బోర్డుల్ని చూపించాలని కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. డీసీపీ మహాపాత్ర మాట్లాడుతూ అనధికార బోర్డుల్ని తొలగించామని, అయితే వాటికి సరైన సంరక్షణ లేకపోవడంతో తిరిగి యజమానులే తీసుకువెళుతున్నారని చెప్పారు. అధికారులు బోర్డులు తొలగించి తిరిగి యాజమానులకే అప్పగిస్తున్నారని కార్పొరేటర్లు ఆరోపించారు. కమిషనర్ కీర్తి చేకూరి కలగజేసుకుని, గత వర్షాల కారణంగా నగరంలో అక్కడక్కడ బోర్డులు పడ్డాయని, దీని పరిష్కారానికి 15 రోజుల్లో స్టెబులిటీ సర్టిఫికెట్ ఇవ్వాలని, లేనిపక్షంలో వాటిని తొలగించాలని ఆదేశించారు. అనధికార హోర్డింగ్స్‌ను 15 రోజుల్లో పూర్తిగా తొలగించాలని అధికారులకు చెప్పారు.

కార్పొరేషన్ స్థలాల్లో దర్జాగా వ్యాపారాలు

నగరపాలక సంస్థకు చెందిన అత్యంత విలువైన స్థలాల్ని లీజుల పేరుతో రాయించుకుని గడువు పూర్తయినప్పటికీ అప్పగించకుండా కోర్టుల్ని ఆశ్రయించి పలువురు వ్యాపారాలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. అడిగిన ప్రశ్నలకు అధికారులు కూడా సరైన సమాధానం కూడా ఇవ్వడం లేదని, కార్పొరేటర్లు అంటే అంత లోకువా ? అని ప్రశ్నించారు. నగరపాలక సంస్థకు చెందిన స్థలంలో చిన్మయ విద్యా సంస్థ లీజుకు తీసుకుని, కమర్షియల్ కింద కల్యాణ మంటపం కట్టి వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తోందని కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి తెలిపారు. దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బృందావన్ గార్డెన్స్‌లో, లీలా మహల్ దగ్గర కార్పొరేషన్ స్థలాల్లో పెట్రోల్ బంకులు నిర్వహిస్తున్నారన్నారు. వీరిలో కొంత మందికి లీజులు గడువు పూర్తయినప్పటికీ కోర్టులకు వెళ్లి స్టేలు తెచ్చుకుంటూ కార్పొరేషన్ ఆదాయానికి గండిపెడుతున్నారని ఆరోపించారు. అధికారులే లీజుదారులకు కోర్టులకు వెళ్లాలంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారని సభ దృష్టికి తెచ్చారు.

సిబ్బందిని ఏ ప్రతిపాదికన తీసుకున్నారో చెప్పాలి?

వైఎస్సార్ సీపీ అధికారంలోకి అధికారంలోకి వచ్చిన తరువాత నగరపాలక సంస్థలో 105 మందిని అప్కాస్ పద్ధతిలో విధుల్లోకి తీసుకున్నారని, వారందరిని ఏ ప్రాతిపదికన తీసుకున్నారో చెప్పాలని గత కౌన్సిల్ సమావేశాల్లో ప్రశ్నించినప్పటికీ సమాధానం లేదని కార్పొరేటర్ మర్రి అంజలి ప్రశ్నించారు. కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ఆ సమయంలో సిబ్బందిని ఏ విధంగా తీసుకున్నారో స్పష్టంగా తెలియడం లేదని, దీనికి సంబంధించి పూర్తి వివరాలతో తెలియజేయాలని సస్పెండ్ అయిన సిరిల్‌పాల్‌కు నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. సంబంధిత ఫైల్ వచ్చేంత వరకు 105 మందికి జీతాలు నిలుపుదల చేయాలని కార్పొరేటర్ డిమాండ్ చేశారు.

ఎస్సీ వార్డులను డెవలప్ చేయరా?

ఆదిత్య నగర్ 1వ లైను మెయిన్ రోడ్డు నుంచి సంజీవయ్యనగర్ రైల్వే గేటు తూర్పు వైపు చేపట్టిన మెయిన్ డ్రెయిన్ పనులు 30శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు పూర్తి చేయడం లేదని కార్పొరేటర్ మల్లవరపు రమ్య ప్రశ్నించారు. సిటీప్లానర్ ప్రదీప్ మాట్లాడుతూ సదరు ప్రాంతంలో స్ట్రక్చర్స్(ఇళ్లు) ఓనర్స్ మారడం వల్ల, ఇతర కారణాలతో పనుల్లో జాప్యం జరిగిందని తెలిపారు. తొమ్మిది నెలల కిందట సదరు పనులకు మేయర్ కావటి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారని, ముందు అంతా సక్రమంగానే జరిగాయని కార్పొరేటర్ తెలిపారు. ఇప్పుడు ఓనర్స్ మారారు.. నష్టపరిహారం ఇవ్వాలని అధికారులు చెప్పడం చూస్తుంటే ఎస్సీ కాలనీ అభివృద్ధి చేయాలంటే ఇష్టం లేదా ? అని ఆమె ప్రశ్నించారు. డొంక రోడ్డు నుంచి శారదా కాలనీ వరకు రోడ్డు విస్తరించాలని ప్రతి కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నలు పెట్టినప్పటికీ ఎటువంటి ఫలితం లేకుండా పోయిందని కార్పొరేటర్లు దూపాటి వంశీబాబు, పాపతోటి అంబేడ్కర్ వాపోయారు. రోడ్డు విస్తరణ చేయకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీ ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ త్వరలోనే సదరు రోడ్డు విస్తరణ పనులు చేపడతామని సమాధానం ఇచ్చారు. ఇదే మాట ప్రతి కౌన్సిల్ సమావేశంలో వింటూనే ఉన్నామని, ఎస్సీ వార్డులను అభివృద్ధి చేసే ఉద్దేశం అధికారులకు లేదా ? అని ప్రశ్నించారు.

బిల్లుల చెల్లింపులపై విజిలెన్స్, ఏసీబీకి రాస్తా : మేయర్ కావటి

డ్రెయిన్లలోకి దిగి కాలువలు శుభ్రం చేయించిన కాంట్రాక్టర్లకు కూడా బిల్లులు మంజూరు చేయకపోవడం దారుణమని మేయర్ కావటి తెలిపారు. నగరంలో అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు సీరియల్ ప్రకారం కాకుండా, సెలెక్టెడ్ కాంట్రాక్టర్లకు మాత్రమే జరుగుతున్నాయని ఆరోపించారు. దీనిపై మేయర్ హోదాలో విజిలెన్స్, ఏసీబీకి రాస్తానని చెప్పారు. కాంట్రాక్టర్లకు సీరియల్ ప్రకారం బిల్లులు చెల్లించకపోవడం వల్ల ప్రతి వార్డులో అభివృద్ధి పనులు కొంత మేర ఆలస్యంగా జరుగుతున్నాయని చెప్పారు. బిల్లుల చెల్లింపుకు సంబంధించి అధికారులు ఒక ఫార్మెట్ ఇస్తే దాని ప్రకారం కాంట్రాక్టర్లతో, ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, మంజూరులో జాప్యం లేకుండా చూస్తామని తెలిపారు.

రైల్వే సీనియర్ డీఈఈ దినేష్‌రెడ్డికి అవార్డు



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్‌లో సీనియర్ డీఈఈగా పని చేస్తున్న సీహెచ్. దినేష్‌రెడ్డికి అతి విశిష్ట రైలు సేవా పురస్కార్ అవార్డు లభించింది. ఆయన విజయవాడ డివిజన్‌లో చేసిన సేవలు, ప్రతిభను గుర్తించి రైల్వే మంత్రిత్వ శాఖ ఈనెల 15న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేసింది. దినేష్‌రెడ్డి 2016లో జీఎం అవార్డు, 2013లో పీసీఈఈ అవార్డు కూడా అందుకున్నారు. ఈ సందర్భంగా పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డీఆర్ఎం రామకృష్ణ, సిబ్బంది అభినందించారు.

వైభవంగా కార్తిక దీపోత్సవం



కార్తిక దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంట మంత్రివారి వీధిలోని అయ్యప్ప రెసిడెన్సీ నిర్వాసితుల ఆధ్వర్యంలో సోమవారం కార్తిక దీపోత్సవాన్ని నిర్వహించారు. వేద పండితులు శ్రీమాన్ తాతాచార్యులు కార్తిక మాస విశిష్టతను తెలియజేసి, పూజల్ని నిర్వహించారు. భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో మద్ది రవికుమార్, మహంకాళి శ్రీనివాసరావు, కిశోర్, అనిల్, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి లలిత కళా ఉత్సవంలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న విష్ణువర్ధన్, కృష్ణవేణి, వరప్రసాదరావు

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీవేంకటేశ్వర బాలకుటీర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి లలిత కళా ఉత్సవంలో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విష్ణువర్ధన్ మాట్లాడుతూ కీబోర్డు పోటీలో 9వ తరగతి విద్యార్థి పి. నంద కిషోర్, తాళ వాయిద్య పోటీలో 8వ తరగతి విద్యార్థి టి. బోస్ అనుదీప్ ద్వితీయ బహుమతులు గెలుపొందినట్లు వివరించారు. విద్యతో పాటు సంగీత, సాహిత్య కళల్లో మేటిగా అన్ని రంగాల్లో రాణించే విధంగా విద్యార్థుల్ని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను తీర్చిదిద్దిన సంగీత విద్వాంసుడు నెమలి రాంబాబును ప్రశంసించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, వైస్ ప్రిన్సిపాల్ పాలేటి తేజస్వి, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి పాల్గొన్నారు.

వైభవంగా మాస శివరాత్రి పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి

గుంటూరు ఈస్ట్: మాస శివరాత్రి, కార్తిక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని తురకపాలెం గంగా భ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జునస్వామి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. స్వామికి విశేష ద్రవ్యాలతో కన్నుల పండువగా అభిషేకం చేశారు. పుష్పార్చనలు, సహస్రనామార్చనలు జరిపారు. సాయంత్రం శివలింగాకారంలో దీపోత్సవం వైభవంగా చేశారు. దీపాకాంతుల నడుమ ఆలయం బంగారుకాంతులీనింది. ఆలయ ప్రధాన అర్చకులు నాగఫణీంద్రకుమార్‌శర్మ పర్యవేక్షణలో భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

అసమానతలు లేని ఆర్థిక వ్యవస్థతోనే పేదరిక నిర్మూలన



లక్ష్మీపురం: అసమానతలు లేని ఆర్థిక వ్యవస్థతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని న్యాయవాది, విశ్లేషకుడు ముప్పాళ్ల ప్రసాదరావు తెలిపారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ 1948 డిసెంబర్ 10న పారిస్‌లో సమావేశమైన ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ ప్రపంచవ్యాప్తంగా పౌర హక్కుల పరిరక్షణకు ప్రతిజ్ఞ చేసిందని, అదే సార్వత్రిక మానవ హక్కుల ప్రకటనగా ప్రసిద్ధి పొందిందని తెలిపారు. మానవ హక్కులతో కూడిన ఆర్థిక వ్యవస్థలోనే పేదరిక నిర్మూలన సాధ్యమని పేర్కొన్నారు. ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలతోనే మానవ హక్కులు నిలబెట్టుకోవాలని సూచించారు. ప్రభుత్వాలు కూడా మానవ హక్కుల్ని గౌరవించాలని కోరారు. సమావేశంలో అవగాహన సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో బాధ్యతాయుత ప్రవర్తనతో మెలగాలి

జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి శ్రావణ్‌బాబు



గుంటూరు ఎడ్యుకేషన్: కళాశాల విద్యార్థి దశలోకి అడుగుపెట్టిన విద్యార్థులు క్రమశిక్షణతో పాటు బాధ్యతాయుత ప్రవర్తనతో మెలగాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సోమవారం డీఫార్మసీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఫార్మాడీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు తరగతుల ప్రారంభం సందర్భంగా ''దీక్షారంభ్'' పేరుతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ విద్యార్థి దశలో గుంటూరు వైద్య కళాశాలలో గడిపిన రోజుల్ని గుర్తు చేసుకుంటూ, అక్కడ చదవడం విద్యార్థులందరికీ మధుర జ్ఞాపకంగా ఉంటుందని తెలిపారు. వైద్యవృత్తికి ఫార్మసీ విద్య అనుసంధానంగా ఉంటుందని, విద్యార్థులు ప్రమాదకర జబ్బులకు ఔషధాలు కనిపెట్టేందుకు పరిశోధనలు చేయాలని సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుని, భావి జీవితానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ ఘన చరిత్ర కలిగిన హిందూ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఫార్మసీ కళాశాలను లాభాపేక్షకు తావులేని రీతిలో విద్యార్థులకు ఉజ్వల భవిత అందించడమే ధ్యేయంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, దీక్షారంభ్ సమన్వయకర్త డాక్టర్ డి. బ్రహ్మ శ్రీనివాసరావు, ఫార్మాడీ డైరెక్టర్ పి. సీతారామయ్య పాల్గొన్నారు.

రౌడీషీటర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి: డీఎస్పీ

కాకుమాను: రౌడీషీటర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎస్పీ మహబూబ్ బాషా సూచించారు.స్థానిక పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన వార్షిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి, భవిష్యత్‌లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో రాత్రి సమయాల్లో ప్రతి రోజూ గస్తీ నిర్వహించి, ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించారు.

సందడిగా వీవీఐటీ బాలోత్సవ్- 2023



బాలోత్సవ్ కారులో షికారు



బాలోత్సవ్ ప్రారంభ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు



వేడుకల్లో చిన్నారి నృత్యం



విద్యార్థులతో కలసి స్టెప్పులేస్తున్న విక్టరీ వెంకటేష్



నాన్నా... మేకప్ జాగ్రత్త



అమ్మా...ఒక సెల్ఫీ



చిత్రలేఖనం పోటీలో చిన్నారులు



సెల్ఫీ తీసుకుంటున్న చిన్నారి



వేడుకల్లో చిన్నారుల నృత్యం

నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ)లో సోమవారం బాలోత్సవ్ వేడుకలు కోలాహలంగా సాగాయి. చిన్నారులు, తల్లిదండ్రులు, చిత్ర బృందంతో వీవీఐటీ ప్రాంగణం సందడిగా మారింది. ఏకపాత్రాభినయం, సంప్రదాయ నృత్యం, సంప్రదాయ వస్త్రధారణ వంటి విభాగాల్లో తొలిరోజు పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అత్యధికంగా చిత్రలేఖనం పోటీల్లో 1600 మంది చిన్నారులు పాల్గొన్నారు. తెలుగు వక్తృత్వం, తెలుగులోనే మాట్లాడటం, తెలుగు పద్యం, సంస్కృత శ్లోకం వంటి విభాగాలు చిన్నారుల్లో తెలుగుపై ఉన్న మక్కువను తెలియజేశాయి. హీరో విక్టరీ వెంకటేష్ నటించిన సైంధవ్ చిత్ర యూనిట్ చిన్నారులతో ఆడి, పాడి అలరించింది. చిత్ర హీరో విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ చిన్నారులు ఎల్లప్పుడూ మంచిగా ఆలోచించాలని, తద్వారా ఆనందంగా ఉంటారని సూచించారు. చదువును నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని తెలిపారు. అనంతరం సైంధవ్ చిత్రంలోని పాటను చిన్నారుల మధ్య విడుదల చేశారు.

– పెదకాకాని